క్లుప్తంగా

నేడు జాబ్ మేళా

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక న్యాక్ బిల్డింగ్‌లో మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సి.విజయ వినీల్ కుమార్, న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రాకేష్ తెలిపారు. సోమవారం మాట్లాడుతూ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాలలో 10 కంపెనీలు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కలిపిస్తాయన్నారు. ఈ జాబ్ మేళాకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఆపైన చదువుకున న వారు తమ బయోడేటాతోపాటు విద్యార్హత సర్టిఫికెట్లను తీసుకుని రావాలన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9640015507, 8309802035 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

బారికేడ్లు ఏర్పాటు



ఎస్‌బీఐ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

కొండాపురం: మండలంలోని కొండాపురం ఎస్‌బీఐ సర్కిల్ వద్ద ప్రమాదాలను నివారించేందుకు బారికేడ్లను ఏర్పాటు చేసినట్లు కొండాపురం ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వాహనదారుల వేగాన్ని నియంత్రించేందుకు బారికేడ్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఇటీవల జరిగిన స్థానిక శ్రీ స్వామి వివేకనంద విద్యాలయం ప్రిన్సిపాల్ రామలింగేశ్వర్‌రెడ్డి బారికేడ్లు తన సొంత నిధులతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

చిలంకూరులో పర్యటించిన ఆర్డీఓ



సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీఓ

జమ్మలమలడుగు: ఎర్రగుంట్ల మండలంలోని చిలంకూరులో పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య పర్యటించారు. ఇటీవల అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని బాధిత గ్రామాల ప్రజలు కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశారు. దీంతో సోమవారం ఆర్డీఓ చిన్నయ్య పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అల్ట్రాటెక్ పరిశ్రమ బ్లా స్టింగ్ వల్ల గ్రామాల్లో ఇళ్లు దెబ్బతినడంతోపాటు సిమెంట్ పరిశ్రమకు కావలసిన ముడిసరుకును అధిక లోడుతో తమ రోడ్లపై తీసుకుపోతుండటంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయని తెలిపారు. చిలంకూరు నుంచి మాలేపాడుకు ఉన్న రస్తాను మైనింగ్ కోసం సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం మూసివేసిందని ఆర్డీఓ దృష్టికి తెచ్చారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ఏఓ అక్బల్ బాషా

జమ్మలమడుగు: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రెవెన్యూ డివిజనల్ కార్యాలయ ఏఓ అక్బాల్‌బాషా తెలిపారు. సోమవారం ఏఓగా ఆర్డీఓ కార్యాలయంలో అక్బాల్‌బాషా బాధ్యతలు చేపట్టారు. దువ్వూరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఈయన జమ్మలమడుగు ఆర్డీఓ కార్యాలయానికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఏఓకు సిబ్బంది అభినందనలు తెలిపారు. అదేవిధంగా కోనేరు రంగరావు కమిటీ తహసీల్దార్‌గా మహబూబ్ బాషా కూడ ఆర్డీఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

నీట్‌లో ప్రతిభ

సింహాద్రిపురం: మండలంలోని చవ్వారిపల్లెకు చెందిన విద్యార్థి ఎల్.నిషాల్‌రెడ్డి నీట్‌లో ఆలిండియా 17,965 ఆల్ ఇండియా ర్యాంక్ సాధించాడు. ఓసీ కేటగిరీలో 7,463 ఆలిండియా ర్యాంక్ సాధించి సత్తా చాటాడు. ఈ సందర్భంగా విద్యార్థి నిషాల్‌రెడ్డి మాట్లాడుతూ న్యూరో సర్జన్ వైద్యుడిగా వైద్య సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నానని పేర్కొన్నాడు. పలువురు నిషాల్‌రెడ్డిని అభినందించారు.

సమస్యలు పరిష్కరించండి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

చక్రాయపేట: తమ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దారు విజయకుమారికి వినతి పత్రం ఇచ్చినట్లు మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు గిత్తోళ్ల పెద్ద నారాయణ ఓప్రకటనలో తెలిపారు. వేతనాల పెంపు, పదోన్నతులు, కార్యాలయంలో ఉద్యోగుల భర్తీ చేసి తమకు పని భారం తగ్గించాలని తదితర డిమాండ్లతో వినతి పత్రాన్ని అందజేసినట్లు చెప్పారు. ఉన్నతాధికారుల స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పరీక్షలు లేవు.. పర్యవేక్షణ కానరాదు

- రోడ్లపైనే మాంసం విక్రయాలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- నిబంధనలు పట్టించుకోని వ్యాపారులు

వేంపల్లె : వేంపల్లె మండల వ్యాప్తంగా నిబంధనలు పాటించకుండా రోడ్లపైనే మాంసపు విక్రయాలు చేపడుతున్నారు. మాంసపు వ్యాపారులు ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేశారు. మాంసంపై దుమ్ము, ధూళి పడుతున్నా.. ఈగలు ముసురుతున్నా యథేచ్ఛగా విక్రయాలు సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

వేంపల్లె పట్టణంలోని గాంధీ రోడ్డులో ఉన్న తిరుమల థియేటర్ సర్కిల్, జెడ్పీ కాంప్లెక్స్ వెనుక వైపు, బ్యాంకు సర్కిల్, కడప రోడ్డు, పాత సంత మార్కెట్, తదితర ప్రాంతాల్లో మాంసపు విక్రయ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ ప్రతి ఆదివారం, మంగళవారం, గురు, శుక్ర వారాలల్లో విక్రయాలు ఎక్కువగా జరుగుతాయి. వేంపల్లె పంచాయతీ పరి



గాంధీ రోడ్డులోని డ్రైనేజీ కాలువ పక్కనే మాంసాన్ని వేరుచేస్తున్న వ్యాపారస్తులు

ధిలోని గాంధీ రోడ్డులోని తిరుమల థియేటర్ సర్కిల్ వద్ద మాత్రం ప్రతిరోజు మాంసపు విక్రయాలు జరుగుతున్నాయి.

దుమ్ము ధూళి పడుతున్నా..

గాంధీ రోడ్డు, జెడ్పీ కాంప్లెక్స్, బ్యాంకు సర్కిల్ వద్ద రోడ్ల పక్కనే పొట్టేళ్లను కోసి మాంసాన్ని కుప్పలుగా వేసి విక్రయిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. అంతేకాకుండా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 72 అడుగుల మేర రోడ్డు విస్తరణ పనులు మొదలుపెట్టారు. తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎక్కడ పనులు అక్కడే ఆగిపోయాయి. దీంతో ప్రధాన రోడ్లన్నీ దుమ్ముతో నిండి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఒకపక్క రోడ్డు పక్కనే మాంసాన్ని ముక్కలుగా కోసి తూకాలు వేసి విక్రయానికి సిద్ధంగా ఉంచుతున్నారు. వాటిపై దోమలు, ఈగలు వాలుతూ కొనుగోలుదారులు రోగాల బారినపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

నిబంధనలు ఉల్లంఘన

నిబంధనల మేరకు పొట్టేళ్లు, గొర్రెలు, మేకపోతులు ఆరోగ్యంగా ఉండాయా లేదా అని పశువైద్య అధికారులు పరీక్షించాలి. మాంసపు విక్రయ ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండాలి. అలా కాకుండా మాంసం వ్యాపారులు రోగాల బారిన గొర్రెలు, రెండు, మూడు రోజుల్లో చనిపోయే మేక పిల్లలు, పాలిచ్చే మేకలను వధించి మాంసాన్ని విక్రయిస్తున్నారు. ప్రజారోగ్య అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు.

పరిశుభ్రత పాటించాలి



మాంసపు వ్యాపారులు పొట్టేళ్లను వధించే సమయంలో పరిశుభ్రత పాటించాలి. ప్రత్యేక డ్రెస్ కోడ్ వేసుకుని చేతులకు బ్లౌజులు వేసుకోవాలి. మాంసంపై దుమ్ము ధూళి, ఈగలు, దోమలు, ముసరకుండా చూసుకోవాలి. ఎక్కడబడితే అక్కడ మాంసాన్ని వేరు చేయడం వ్యాపారులకు పరిపాటిగా మారింది. ప్రజారోగ్య, సంబంధిత అధికారులు మాంసపు విక్రయదారులపై చర్యలు తీసుకోవాలి.

– ఎద్దుల రామచంద్ర, వేంపల్లె

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మాంసపు విక్రయదారులు నిబంధనలు పాటించాలి. నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటాం. వ్యాపారులు అధిక ధరలకు మాంసం విక్రయాలు చేస్తున్నారని మా దృష్టికి వచ్చింది. తొందరలో నోటీసులు పంపుతాం. విక్రయానికి ఉంచిన మాంసంపై దుమ్ము, ధూళి, ఈగలు, దోమలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– కె.మాధవరెడ్డి, గ్రామపంచాయతీ ఈఓ, వేంపల్లె

మంచి విత్తనాలతోనే దిగుబడి

సింహాద్రిపురం : వానాకాలంలో అధిక దిగుబడి సాధించాలంటే మంచి విత్తనాలను రైతులు ఎంపిక చేసుకోవాలని వ్యవసాయ అధికారిగా కె.కల్యాణ్ కుమార్ తెలిపారు. సింహాద్రిపురం వ్యవసాయ అధికారిగా కె.కల్యాణ్ కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన నంద్యాలలో జిల్లా వ్యవసాయ కార్యాలయంలో పనిచేస్తూ బదిలీపై సింహాద్రిపురం ఏఓగా బాధ్యతలు చేపట్టారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

వేముల : సాగులో యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారిగా ఓబులేసు తెలిపారు. వేముల మండల వ్యవసాయాధికారిగా ఓబులేసు నియమితులయ్యారు. ఇక్కడ ఏఓగా పనిచేస్తున్న చెన్నారెడ్డి పులివెందులకు బదిలీపై వెళ్లారు. దీంతో పెండ్లిమర్రి మండలంలో ఏఓగా పనిచేస్తున్న ఓబులేసును వేముల ఏఓగా నియమించడంతో సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు అందుబాటులో ఉంటానని, రైతులకు ఎప్పటికప్పుడు పంటలపై సూచనలు, సలహాలు ఇస్తానన్నారు. సోమవారం ఆయన వేముల రైతు సేవా కేంద్రంలో రైతుల వేలిముద్రల తీరుతెన్నులను పరిశీలించారు.



ఏఓ కే. కల్యాణ్ కుమార్



ఏఓ కే. రాజు

కార్యక్రమంలో ఏఈఓ సురేష్, వీహెచ్‌ఏ హారిక తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

తొండూరు : తొండూరు మండల వ్యవసాయ అధికారిగా కె.రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో కర్నూలు జిల్లా కోసగి మండలంలో వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై తొండూరు మండలానికి వచ్చారు. మండలంలోని గ్రామాల ప్రజలకు ప్రభుత్వం తరపున వస్తున్న విత్తనాలు, ఎరువులు, రాయితీ వ్యవసాయ పరికరాల గురించి ప్రజలకు సమాచారం తెలియజేస్తానని, గ్రామాలలో పంటల వివరాలను తమ దృష్టికి తీసుకువస్తే వాటికి సంబంధించిన పురుగు మందులు కానీ, తెగులు మందులు కానీ, ఎరువుల కానీ, యాజమాన్య పద్ధతుల గురించి తెలియజేస్తానన్నారు. అలాగే మండల ప్రజలకు అందుబాటులో ఉంటానని రైతులకు పలు సూచనలు, సలహాలు ఇస్తానని తెలిపారు.

విద్యుత్ వైర్లకు అల్లుకున్న మొక్కల తొలగింపు



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న తీగలను తొలగించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

పులివెందుల రూరల్: పులివెందుల మండల పరిధిలోని ఎర్రబల్లె పంచాయితీ మల్లికార్జునపురం, కొత్తపల్లి గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు, విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్న మొక్క తీగలను ట్రాన్స్‌కో అధికారులు తొలగించారు. ఇటీవల ఆయా గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు, ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగలకు తీగ మొక్కలు అల్లుకోవడంతో 'అల్లుకున్న నిర్లక్ష్యం' అనే వార్త సాక్షి పత్రికలో ఆదివారం ప్రచురితమైంది. దీంతో విద్యుత్ శాఖ అధికారులు మండలంలోని మల్లికార్జునపురం గ్రామానికి వెళ్లి విద్యుత్ స్తంభానికి, ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న మొక్క తీగలను తొలగించి శుభ్రపరిచారు. దీంతో గ్రామస్తులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

శక్తి యాప్‌పై అవగాహన కలిగి ఉండాలి

పులివెందుల రూరల్ : శక్తి యాప్‌పై మహిళలు, ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సీఐ చాంద్ బాషా అన్నారు. సోమవారం పులివెందుల పట్టణంలోని పలు ప్రాంతాలలో మహిళలకు, విద్యార్థులకు మహిళ యాప్ – మహిళ భద్రత గురించి అవగాహన కల్పించారు. మహిళలు మహిళ ఈ శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. ఏదైనా ప్రమాదంలో ఉన్నప్పుడు మహిళ యాప్ ద్వారా పోలీసులకు సమాచారం అందించిన వెంటనే స్పందించి సంబంధిత ప్రాంతానికి రావడం జరుగుతుందన్నారు. యాప్ గురించి ప్రతి మహిళా పోలీసు



శక్తి యాప్ గురించి అవగాహన కల్పిస్తున్న సీఐ చాంద్ బాషా

మహిళలకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నియామకం

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లా అనుబంధ విభాగ కమిటీలను నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. జిల్లా మేధావుల ఫోరం కమిటీ ఉపాధ్యక్షులుగా బి. విష్ణువర్ధన్‌రెడ్డిని (పులివెందుల) నియమించారు.

సన్మానం

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె మండలంలోని కొలుములపల్లి ఉన్నత పాఠశాలలో నాలుగున్నర సంవత్సరాల కాలం పాటు పనిచేసి ప్రస్తుతం బదిలీపై చెన్నూరు మండలం ఉప్పరపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు బదిలీ అయిన గణిత ఉపాధ్యాయుడు కంభం బాలగంగిరెడ్డిని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ చైర్మన్, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి బాలగంగిరెడ్డి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. రెండు సంవత్సరాలు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించి మండలంలోనే పాఠశాల పేరును మొదటి స్థానంలో నిలిపారని కొనియాడారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కడప అర్బన్: సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాల నేపథ్యంలో మహిళలు, చిన్నారులు అప్రమత్తంగా ఉండాలని మహిళా పి.ఎస్ ఇన్‌స్పెక్టర్ కె.ఎల్లమరాజు సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు వివిధ సమస్యలపై స్టేషన్ కు వచ్చిన వారికి మహిళా పోలీస్ స్టేషన్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించాలన్నారు. వారితో సన్నిహితంగా ఉంటూ వారి బాగోగులను అడిగి తెలుసుకోవాలన్నారు. 10 ఏళ్లలోపు బాలికలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ సంబంధించిన సమాచారాన్ని డయల్ 112 కు అందించాలని సూచించారు. శక్తి యాప్ పనితీరును వివరించి డౌన్ లోడ్ చేయించారు.181, 1098, 1930 హెల్ప్ లైన్ నెంబర్లను వివరించారు.

'అధ్యాపకులను వేధిస్తున్న జేఎన్‌టీయూ అధికారులు'

పులివెందుల రూరల్ : పులివెందుల జేఎన్‌టీయూ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను అనంతపురం జేఎన్‌టీయూ అధికారులు వేధిస్తున్నారని కాంట్రాక్ట్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం కాంట్రాక్టు సిబ్బంది తెలుపుతూ గత 15ఏళ్లగా పులివెందుల జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్నామని, ప్రతి సంవత్సరం కళాశాలలో ఎలాంటి ఇంటర్వ్యూ లేకుండా సర్వీస్‌ను పునరుద్ధరించారని, దానికి భిన్నంగా ఈ ఏడాది ఇంటర్వ్యూ నిర్వహించి యథావిధిగా సర్వీస్‌ను పునరుద్ధరించడం జరిగిందన్నారు. అయితే సోమవారం తమ సర్వీస్ పునరుద్ధరించుకోమని ఒత్తిడి పెంచుతున్నారని వాపోయారు. కొత్తగా పెట్టిన నింబధనలు ఉద్యోగ భద్రతకు భంగం కలిగించే విధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

పందులు.. ఇబ్బందులు

ముద్దనూరు: ముద్దనూరులో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. పందుల పెంపకంపై నిబంధనలు విధించినా పెంపకందారులు వాటిని వీధుల్లో వదిలేయడంతో విచ్చలవిడిగా తిరుగుతూ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి. ఆహారం కోసం గుంపులు గుంపులుగా చెత్తకుప్పలు, డస్ట్‌బిన్ల దగ్గర సంచరిస్తూ.. చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలను ఇళ్ల మధ్యలోకి తీసుకొస్తున్నాయి. వెళ్లగొట్టేందుకు స్థానికులు ప్రయత్నిస్తే ఎదురుదాడికి దిగుతున్నాయి. దీంతో ప్రజలు బయటకెళ్లాలంటేనే భయపడుతున్నారు. పందులను పట్టుకెళ్లాలని అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. కాలనీలు, వీధులను అడ్డాలుగా చేసుకుని సమస్యలు సృష్టిస్తున్నాయి. ఎయిడెడ్ జూనియర్ కళాశాల సమీపంలో పందుల పెంపకందారులు తిష్టవేసినా అధికారులు చూసీచూడనట్లు



జెడ్పీ బాలుర హైస్కూల్ మైదానంలో సంచరిస్తున్న పందుల

వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. కళాశాల, పాఠశాల, సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు వీటివల్ల వ్యాధులు సంభవించే ప్రమాదముందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముద్దనూరు మండల కేంద్రంలో పలు ప్రాంతాల్లో పందుల పెంపకందారులు నివాసాలు ఏర్పర్చుకున్నారు. దీంతో పందులు స్వైర్య విహారం చేస్తున్నాయి. అధికారులు స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో తీవ్ర నిర్లక్ష్యం

నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు సాయికుమార్ రెడ్డి



వల్లూరు(చెన్నూరు): రాష్ట్రంలో ఉన్నత విద్య పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని విద్యార్థులతో పాటు కళాశాలల యాజమాన్యాల దుస్థితి దినదిన గండంగా తయారైందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షులు గుమ్మల సాయి కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన చెన్నూరులో విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు కూటమి ప్రభుత్వం గుది బండగా మారిందని ప్రభుత్వ తీరుపై మండి పడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు కొండలా పేరుకు పోవడంతో కళాశాలల మనుగడ, విద్యార్థుల భవిష్యత్తు పెను ప్రమాదంలో పడిందని ఆయన తెలిపారు. ప్రభుత్వం సకాలంలో ఫీజు చెల్లింపులు చేయకపోవడంతో కళాశాలల ఉనికికే ప్రశ్నార్థకంగా మిగిలిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో దాదాపు రూ.4,200 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్, రూ.2,200 కోట్లు హస్టల్ మెయింటిన్స్ ఛార్జీలు (వసతి దీవెన) మొత్తంగా రూ.6,400 కోట్లు పెండింగ్ లో పెట్టడం దారుణమన్నారు. వాస్తవానికి అధిక శాతం కళాశాలలు విద్యార్థుల ఫీజులపైనే ఆధారపడి నిర్వహణను చేపట్టడం జరుగుతుందని. సకాలంలో కూటమి ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయాయని ఆయన తెలిపారు. కళాశాలలో అధ్యాపకులకు, బోధ నేతర సిబ్బందికి జీతాలు చెల్లించలేక కళాశాల యాజమాన్యాలు కొట్టుమిట్టాడు తున్నాయని ఆయన అన్నారు. ఈ పరిణామాల ఫలితంగా విద్యార్థులకు నాణ్యమైన బోధన లభించడం లేదని అధునాతన సాంకేతిక మార్పులకు అనుగుణంగా కళాశాలలు అప్ గ్రేడ్ అవలేక మూస పద్ధతిలోనే కొనసాగడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

అదనపు లోడు క్రమబద్ధీకరణలో రాయితీ


సింహాద్రిపురం: విద్యుత్ వినియోగదారులకు అదనపు లోడు క్రమబద్ధీకరణలో 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ దినేష్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అదనపు లోడు రాయితీ ఈ నెలాఖరు వరకు చెల్లించవచ్చునని చెప్పారు. అనేక గృహాల వద్ద పెరిగిన విద్యుత్ వినియోగం కారణంగా ఉన్న లోడ్ సరిపోకపోవడం వల్ల తరచుగా ట్రిప్పింగ్, లో ఓల్టేజ్ సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. వినియోగదారులు తమ సర్వీసులకు అవసరమైన మేరకు లోడ్ పెంపు చేసుకోవడానికి ఈ రాయితీ స్కీంను వినియోగించుకోవాలని సూచించారు.

సోలార్ల కోసం దరఖాస్తు చేసుకోండి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం కింద రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ దినేష్ కుమార్ సూచిస్తున్నారు. ఈ పథకం కింద ప్రభుత్వ సబ్సిడీతో సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేసుకుని, నెలవారీ విద్యుత్ బిల్లును గణనీయంగా తగ్గించుకోవచ్చునన్నారు. ఈ పథకం కింద 1 కిలోవాట్ సోలార్ వ్యవస్థకు రూ.38 వేలు, 2 కిలోవాట్ల వ్యవస్థకు రూ.60వేలు, 3 కిలోవాట్ల కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న వ్యవస్థలకు రూ.78వేల సబ్సిడీ అందుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'అన్నదాత సుఖీభవ' ఈకేవైసీ నమోదు పరిశీలన

లింగాల : మండల కేంద్రమైన లింగాల రైతు సేవా కేంద్రంలో సోమవారం అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల ఈకేవైసీ నమోదు ప్రక్రియను మండల వ్యవసాయ అధికారి రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి మండల వ్యాప్తంగా 6,777మంది రైతులు అర్హులుగా ఉన్నారని, ఇందులో 6,635 మంది రైతులకు ఈకేవైసీ పూర్తయిందన్నారు. ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్న రైతులు ఈనెల 18వ తేదీలోపు పూర్తి చేసుకోవాలని సూచించారు. అలాగే ఈ పథకానికి కుటుంబంలో



ఈకేవైసీ నమోదు పక్రియను పరిశీలిస్తున్న ఏఓ రమేష్ తదితరులు

ఒకరు మాత్రమే అర్హులని, ఆ జాబితా కూడా రైతు సేవా కేంద్రలలో చూసుకోవాలన్నారు. లింగాల రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎస్టీ వర్గీకరణతోనే యానాదులకు న్యాయం

కడప సెవెన్‌రోడ్స్ : షెడ్యూల్ తెగల రిజర్వేషన్లను వర్గీకరించడం ద్వారానే యానాదులకు సామాజిక న్యాయం జరుగుతుందని యానాది రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కేసీ పెంచలయ్య యానాది అన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసిన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎస్టీ వర్గీకరణ విషయంలో అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వైఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు నీలం సురేంద్ర యానాది అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు పెంచలయ్య మాట్లాడారు. రాష్ట్రంలో గిరిజన జనాభాలో 30 శాతం యానాదులే ఉన్నారని తెలిపారు. సుమారు 10 లక్షలకు పైగానే యానాదులు ఉన్నారని పేర్కొన్నారు. గిరిజన జనాభాలో తాము అధికంగా ఉన్నప్పటికీ అభివృద్ధి విషయంలో అట్టడుగున ఉన్నామని తెలిపారు. మైదాన ప్రాంతాల్లో నివసించే ఎరుకల, సుగాలి కులాల వారు తమకు రావాల్సిన ఫలితాలను తన్నుకపోతున్నారని చెప్పారు. ఉద్యోగాలు, పదోన్నతులు, విద్యా సంస్థల్లో సీట్లు, గ్రూప్స్, సివిల్స్ తదితర వాటిల్లో ఇతర తెగలతో పోటీపడలేక పోతున్నామని తెలిపారు. ఈ వ్యత్యాసాన్ని సరిదిద్దాలంటే ఎస్టీ వర్గీకరణ తప్పనిసరి అన్నారు. రాజ్యాంగ ఫలాలు అన్ని వర్గాలకు అందాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణను ఆయా రాష్ట్రాలు చేసుకోవచ్చంటూ గత ఆగస్టులో సుప్రీం కోర్టు స్పష్టం చేసిందని పేర్కొన్నారు. అయినా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఈ విషయాన్ని నిర్లక్ష్యం చేయడం శోచనీయమన్నారు. తమ డిమాండ్లను ఎలుగెత్తి చాటేందుకు త్వరలో విజయవాడలో యానాది గర్జన నిర్వహిస్తున్నామని వెల్లడించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. వైఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు బాపట్ల బ్రహ్మయ్య, అంకమ్మరావు, చెంచయ్య, మాల్యాద్రి, మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్, శ్రీనివాసులు, సింబేటి ఉషా నీలం తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలు, నిరసనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

కడప అర్బన్: కడప నగరంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులకు, కమ్యూనిస్టు పార్టీ నాయకులు, వివిధ సంఘాల నాయకులైనా ధర్నాలు, ర్యాలీలు, నిరసనలు తెలియజేయుటకు పోలీసుల నుంచి ముందస్తు అనుమతిని తప్పనిసరిగా తీసుకోవాలని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కనీసం వారం రోజుల ముందు కార్యక్రమం నిర్వహించే పరిధిలోని పోలీస్ స్టేషన్ ను సంప్రదించి తాము చేయబోయే కార్యక్రమం గురించి తెలుపుతూ, అక్కడ ఒక అప్లికేషన్ తీసుకొని, దాన్ని పూరించి ఆ అప్లికేషన్‌తో కడప డీఎస్పీ ఆఫీసును సంప్రదించాలన్నారు. అనుమతి మంజూరు చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఎవరైనా గానీ ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి ధర్నాలు లేదా ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తే, వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నివాళి

పెండ్లిమర్రి: మండలంలోని మాచునూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పెద్ద వీరారెడ్డి (82) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ ఏ. మల్లికార్జునరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి పి.నరేన్ రామాంజులరెడ్డి మాచునూరు వెళ్లి పెద్ద వీరారెడ్డి మృతదేహానికి నివాళి అర్పించి మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో



పెద్ద వీరారెడ్డి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, నరేన్‌రెడ్డి

వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రమణారెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, ఎంపీటీసీ నాగమల్లారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాలకు పరుగులు



ఈకేవైసీ నమోదు చేసుకుంటున్న రైతులు

వేముల : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ (రైతు భరోసా) పథకానికి పెండింగ్‌లో ఉన్న రైతులందరూ వేలిముద్రలు వేయాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గ వ్యాప్తంగా 40,754మంది రైతులను అర్హులుగా గుర్తించారు. ఇందులో 1,046 మంది పెండింగ్ జాబితాలో ఉన్నారని, వీరంతా నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని రైతు సేవా కేంద్రాలలో వేలి ముద్రలు వేయాల్సి ఉంటుంది. పెండింగ్‌లో ఉన్న రైతులు వేలిముద్రలు వేయకపోతే అన్నదాత సుఖీభవ పథకం వర్తించదని రైతులు చెబుతున్నారు. అర్హులైన రైతులందరూ వేలిముద్రలు వేయాలని ఉత్తర్వులు రావడంతో రైతు సేవా కేంద్రాల పరిధిలోని రైతులందరూ వేలిముద్రలు వేయాలని రైతు సేవా కేంద్ర సిబ్బంది రైతుల సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు పంపారు. దీంతో రైతులందరూ వేలిముద్రల కోసం రైతు సేవా కేంద్రాల వద్ద బారులు తీరారు. అయితే సోమవారం నుంచి డేటా ఆధారంగా రైతుల వివరాలు అన్ని వచ్చినట్లు, పెండింగ్‌లో ఉన్న రైతులు మాత్రమే వేలిముద్రలు వేయాలని ఉన్నతాధికారుల నుంచి సమాచారం వచ్చింది.

మండలాల వారీగా రైతుల వివరాలు

మండలం	మొత్తం రైతులు	పెండింగ్ రైతులు
పులివెందుల	4,182	119
వేముల	6,197	137
లింగాల	6,777	142
వేంపల్లె	4,840	100
చక్రాయపేట	5,641	181
సింహాద్రిపురం	6,339	210
తొండూరు	5,732	157